క్లుప్తంగా

నేడు మట్టి ప్రతిమల పంపిణీ

భైంసాటౌన్: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించాలని హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పెండెపు కాశీనాథ్ సూచించారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు తూమోల్ల దత్తాత్రి, మల్లేశ్, వెంకటేశ్, రాజేశ్వర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు తనిఖీ

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీవో సరిత అన్నారు. గురువారం మండలంలోని రాజురా-1, రాజురా-2 అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నారు. చిన్నారుల బరువు, ఎత్తు వివరాలను ప్రతినెలా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్ శ్రీలత, టీచర్లు ఉన్నారు.

పాఠశాలలకు చేయూత


కంప్యూటర్ అందిస్తున్న పూర్వవిద్యార్థులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం అదే పాఠశాలలో 2002-03లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు రూ.20వేల విలువైన కంప్యూటర్‌ను ప్రధానోపాధ్యాయుడు రాజుకు అందజేశారు. చింతల్‌చాంద ప్రాథమిక పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు ఆ గ్రామ మాజీ సర్పంచ్ ఒడ్నాల వెంకట్ రూ.15వేల విలువైన బూట్లు, టై, బెల్టులు అందించారు. కార్యక్రమంలో ఒడ్నాల వెంకట్, పూర్వవిద్యార్థులు కేశం శ్రీనివాస్, ఆదిల్, రమణ, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో వైద్యశిబిరం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో గురువారం ధర్మారంలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీమంత్ పలువురిని పరీక్షించారు. జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలు సేకరించి మందులు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి హరికుమార్‌గౌడ్, సూపర్‌వైజర్ మతిన్, ఆరోగ్య కార్యకర్త శివకృష్ణగౌడ్, నవనీత పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

నర్సాపూర్(జి): మండలంలోని గుండంపల్లి ఎక్స్‌రోడ్డు 61వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్సై హన్మాండ్లు వాహనదారులకు పలు సూచనలు చేశారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఎస్పీని కలిసిన ఏబీవీపీ నాయకులు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏబీవీపీ నాయకులు ఎస్పీ జానకీషర్మిలను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. క్రిప్టో కరెన్సీ అక్రమ దందాలో నిందితులను అరెస్టు చేసి, విచారణ జరిపిన సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేశారు. యాబిట్ కాయిన్ కరెన్సీ మార్కెటింగ్‌లో భాగస్వాములై విధులను నిర్లక్ష్యం చేసిన ఉపాధ్యాయులపై చర్య తీసుకోవడం అభినందనీయమన్నారు. మిగిలిన నిందితులను అరెస్ట్ చేయాలని కోరారు. నాయకులు శశిధర్, దినేశ్, రిషి, అక్షయ్, సాయి, పరశురాం, సాయికుమార్, శివ, రాజు ఉన్నారు.

పండుగ ప్రశాంతంగా జరుపుకోవాలి

లక్ష్మణచాంద: మండలంలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై సుమలత పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఫంక్షన్‌హాలులో వివిధ గ్రామాల గణేశుడి మండపాల నిర్వాహకులు, యువకులతో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. నిర్వాహకులు తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలకు అనుమతి లేదని పోలీస్‌శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కుంటాల: గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలు అని గ్రంథాలయాధికారి మెంగ రాజు పేర్కొన్నారు. గురుకుల పీఈటీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన సాగర్, ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా ఎంపికైన రాజబాపును గురువారం కుంటాల గ్రంథాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.



మామడ: పొన్కల్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లావ్యాప్తంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు, అధ్యాపకులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. నిర్మల్ బస్టాండ్‌లో డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి బస్సుల్లో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయులను సన్మానించారు. దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విశ్రాంత డీఐఈవోలు ప్రభాకర్, క్రిస్టోఫర్ అలెగ్జాండర్‌ను ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్


లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


నిర్మల్‌లోని అల్ఫోర్స్‌లో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు


భైంసాటౌన్: గుజిరిగల్లి శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో..


ఖానాపూర్‌లోని ఓ పాఠశాలలో..


కుభీర్‌లోని శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో..


భైంసారూరల్: మహాగాం ప్రాథమిక పాఠశాలలో..


దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశ్రాంత డీఐఈవోను సన్మానిస్తున్న అధ్యాపకులు


నర్సాపూర్(జి)లోని ఓ పాఠశాలలో వేడుకలు


సోన్: పాక్‌పట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు


కుంటాల ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థులు


కడెంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

‘ఆలయ నిర్మాణంపై రాజకీయం సరికాదు’

మామడ: సదర్మాట్ బ్యారేజీ సమీపంలో రూ.40 లక్షలతో నిర్మించే నాగదేవత ఆలయం నిర్మాణంపై రాజకీయం చేయడం సరికాదని కాంగ్రెస్ మండల కన్వీనర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు మండలంలోని పొన్కల్‌లో మాట్లాడారు. ఆలయం ముంపునకు గురవుతుండటంతో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు నిధులు మంజూరు చేయించారని.. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. తామే నిధులు మంజూరు చేయించామని బీజేపీ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గంగారెడ్డి, లింగన్న, శేఖర్, నర్సారెడ్డి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘జడ్జితో విచారణ చేయించాలి’

నిర్మల్‌టౌన్: ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలంలో చోటు చేసుకున్న ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎంబీటీ (మజ్లిస్ బచావో తహ్రీక్) అధికార ప్రతినిధి అంజద్ ఉల్లాఖాన్ అన్నారు. గురువారం జైనూరు వెళ్తున్న ఆయనను ఉట్నూరు ఎక్స్‌రోడ్డు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడారు. పోలీసులు, నిఘా వైఫల్యంతోనే అల్లర్లు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. అత్యాచారం, హత్యాయత్నం, ప్రమాదమో తెలియకుండానే ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేపట్టారని విమర్శించారు. ప్రణాళిక ప్రకారం జరిగిన ఈ ఘటనలో బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలని కోరారు. ఇందులో మున్సిపల్ మాజీ చైర్మన్ వాజిద్ అహ్మద్ ఖాన్, ఉమ్మడి జిల్లా ఎంబీటీ అధ్యక్షుడు షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమ నిర్మాణాలు నిలిపివేయాలి’

కడెం: మండల కేంద్రంలో ఇరిగేషన్, ప్రభుత్వ భూముల్లో అనుమతుల్లేకుండా చేపడుతున్న నిర్మాణాలను నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం కడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నీటిపారుదల శాఖ భూములను కబ్జా చేసి, కమర్షియల్ కాంప్లెక్స్ భవనాలు నిర్మిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ ఐదారులకు సహకరిస్తున్న అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు నాయకులు దుర్గం లింగన్న, అకుల సత్తన్న తదితరులున్నారు.

గ్రంథాలయంతో జ్ఞానం

కడెం: గ్రంథాలయంతో జ్ఞానం పెరుగుతుందని ఎఫ్ఆర్వో గీతారాణి అన్నారు. మండలంలోని చిట్యాల్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నల్ల రాంరెడ్డి, కడెంలో ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయాన్ని గురువారం ఎఫ్ఆర్వో ప్రారంభించి మాట్లాడారు. విశ్రాంత ఉపాధ్యాయుడు గ్రంథాలయం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, రాజేశ్, షర్ఫొద్దీన్, కిషన్, సురేశ్, లింగన్న, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణం సాగేదెలా?

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు


బురదమయంగా బూరుగుపల్లి(జి) రోడ్డు

నర్సాపూర్(జి): మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకం కింద నిర్మించిన మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. వర్షాలకు కంకరతేలి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. నర్సాపూర్(జి) మండలంలోని నందన్ గ్రామం నుంచి బామిని(బి), గొల్లమాడ మీదుగా బూరుగుపల్లి(జి) వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర నిర్మించిన బీటీ రోడ్డు అధ్వానంగా మారింది. 12 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు దృష్టి సారించి నిధులు మంజూరు చేసి రోడ్డుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దెబ్బతిన్న రోడ్డు పరిశీలన...

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని గొల్లమాడ నుంచి బూరుగుపల్లి (జి)గ్రామం వెళ్లే మార్గంలో రోడ్డు పాక్షికంగా దెబ్బతింది. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో పుష్పలత దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు.


నందన్ గ్రామానికి వెళ్లే రోడ్డు దుస్థితి


కంకరతేలి గుంతలమయంగా బామిని(బి) రోడ్డు

ఈ విషయమై పీఆర్ ఇన్‌చార్జి ఏఈ క్రాంతికుమార్ మాట్లాడుతూ మండలంలో రోడ్లు సరిగా లేని గ్రామాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రాగానే రోడ్లకు మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూస్తామని పేర్కొన్నారు.

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు


పైప్‌లైన్ మార్గం పరిశీలిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణంలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ పీజీ కాలేజ్, సోఫీనగర్, ఆదర్శనగర్, శ్మశానవాటిక ప్రాంతాల్లో నిర్మిస్తున్న మంచినీటి ట్యాంకులను పరిశీలించి మాట్లాడారు. పట్టణంలో తాగునీరు అందించడానికి అమృత్ పథకం కింద రూ.62 కోట్ల నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. వార్డుల్లోనూ దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో కమిషనర్ సీవీఎన్ రాజు, ఆదిలాబాద్ ఈఈ గంగాధర్, డీఈ సంతోష్, ఏఈలు అరుణ్, హరిభువన్ తదితరులు పాల్గొన్నారు.

‘నిందితుడిని కఠినంగా శిక్షించాలి’

లోకేశ్వరం: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో మహిళపై హత్యాచార యత్నం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ముధోల్ తాలుకా ఎస్టీ విభాగం కన్వీనర్ సంగెం నర్సన్న అన్నారు. గురువారం మండలంలోని పుస్పూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఆదివాసీ నాయకులు ఉన్నారు.

పెంబి: జైనూర్ మండలంలో మహిళపై హత్యాచార యత్నం చేసిన నిందితుడిని ఉరి తీయాలంటూ ఆదివాసీ గిరిజన, తుడుందెబ్బ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మండల కేంద్రంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు వెడ్మ శేఖర్, ఆదివాసీ గిరిజన సంఘం మండలాధ్యక్షుడు ధర్మరాజు, గంగారాం, మారుతి తదితరులు ఉన్నారు.


పెంబిలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గురువుకు సన్మానం

ఖానాపూర్: జిల్లాకేంద్రంలోని మోడ్రన్ పాఠశాలలో పదోతరగతి చదివిన 1992-93 బ్యాచ్ పూర్వవిద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఎంఏ గఫార్.. ప్రస్తుతం ఖానాపూర్‌లోని ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్నాడు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు ఖానాపూర్ ఆశ్రమ పాఠశాలకు వెళ్లి గఫార్‌ను సన్మానించారు. భుజాలపై ఊరేగించి పాదపూజ చేసి తమ అభిమానం చాటుకున్నారు. తన శిష్యులు ఉన్నత స్థానాల్లో ఉండటంతో గఫార్ హర్షం వ్యక్తం చేశాడు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, డాక్టర్ జీకే ప్రసన్న, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ (యూఎస్ఏ) పవన్, దుబాయ్ బ్రాడ్‌కాస్టింగ్ మీడియా నిర్వాహకుడు ప్రవీణ్, నిర్మల్ వ్యాపారులు రత్నాకర్, అభిషేక్‌రెడ్డి, డాక్టర్ అన్వేష్, తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయుడ్ని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

‘నిధులు మంజూరు చేయండి’

కుంటాల: మండలంలోని విఠాపూర్ గ్రామంలో రెడ్డి సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం ఆ సంఘ సభ్యులు ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను భైంసాలోని తన నివాసంలో కలిశారు. తమ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లింగారెడ్డి, సాయారెడ్డి, రాజశేఖర్ రెడ్డి,లింగురాం పటేల్, పలువురు మహిళలు ఉన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

తానూరు: వర్షాలు కురుస్తున్నందున వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ అన్నారు. గురువారం మండలంలోని ఎల్వత్ గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కిర్గుల్(బి)లో..

బాసర: మండలంలోని కిర్గుల్(బి) గ్రామంలో గురువారం డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి రామరాజు అన్నారు. వారి వెంట చంద్రకళ ఉన్నారు

గ్రామాల్లో ఎంపీవో పర్యటన

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడ, ఎర్వచింతల్ గ్రామాల్లో గురువారం ఎంపీవో రత్నాకర్‌రావు పర్యటించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య పనులు పరిశీలించి దోమల నివారణకు బయో లార్వా స్ప్రే చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వాల్‌సింగ్, పలువురు గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు బాబాకు మంగళస్నానం, అలంకరణ, అర్చన తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.